క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



తొర్రూరు: మండలంలోని అమ్మాపురం గ్రామ ఎంపీటీసీ ముద్దం విక్రమ్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాడు. ఆయన తోపాటు తొర్రూరు మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ నరుకుటి గజానంద్ చేరాడు.

18నుంచి పాదయాత్ర

నెహ్రూసెంటర్: శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఈనెల 18వ తేదీన జిల్లాలో మాదిగల మహాపాదయాత్ర ప్రారంభమవుతుందని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ మాదిగ గురువారం తెలిపారు. కార్యక్రమంలో రమేష్, అనిల్‌కుమార్, శంకర్, ప్రవీణ్, రేణుక, రజియా పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు లక్కీడ్రా ఏర్పాటు

నెహ్రూసెంటర్: ఆర్టీసీ ప్రయాణికులకు ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు లక్కీ డ్రా ఏర్పాటు చేశామని డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ గురువారం తెలిపారు. రాఖీ పండుగ మాదిరిగానే లక్కీ డ్రాలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు వరంగల్ రీజియన్ పరిధిలో పురుషులు, మహిళలకు ఒక్కొక్కరికి రూ.9,900 నగదు పురస్కారం ఇవ్వనున్నట్లు తెలిపారు. బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో మహబూబాబాద్ నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేకంగా ఐదు బస్సులు నడుస్తాయని, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సర్వీసులను పెంచుతామని తెలిపారు.

ప్రణాళికా బద్ధంగా చదవాలి

కురవి: పండుగలకు, జాతరలకు ప్రాధాన్యత ఇస్తూనే సమయాన్ని వృథా చేయకుండా సెలవుల్లో ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలని, తల్లిదండ్రులు వారి చదువులపై జాగ్రత్తలు తీసుకోవాలని కురవి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డీసీఎస్ శర్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ పద్మ, ఉపాధ్యాయులు వెంకన్న, రవి, మంగీలాల్, రమేష్, ధర్మ,కరంచంద్, గోవర్ధన్ పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు.

15న జిల్లాస్థాయి పోటీలు

డోర్నకల్: డోర్నకల్‌లో ఈనెల 15న ఐదు జిల్లాల స్థాయి బేంచ్‌ప్రెస్ పోటీలు నిర్వహించనున్నట్లు భారత్‌వీర్ వ్యాయామశాల సెక్రటరీ మండోజు సుధాకర్ గురువారం తెలిపారు. దసరా పండుగను పురస్కరించుకుని వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుల జ్ఞాపకార్థం ఈనెల 15న మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ జిల్లాల స్థాయి బేంచ్‌ప్రెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక జైన్‌భవన్‌లో జరిగే పోటీలలో ఆసక్తి కలిగిన క్రీడాకారులు పాల్గొనాలని సుధాకర్ కోరారు.

అర్హులకు పథకాలు ఇవ్వాలి

కేసముద్రం: అర్హులైన నిరుపేదలకే దళితబంధు, గృహలక్ష్మి పథకాలను ఇవ్వాలంటూ మండలంలోని కాట్రపల్లి గ్రామంలో గురువారం పలువురు గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు జల్లె యాకాంబ్రం మాట్లాడుతూ.. పథకాలకు అనర్హులను ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుగులోతు సునీత, అహల్యాదేవి, సుమలత, ఎల్లమ్మ, సునీత, పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

చిన్నగూడూరు: డబుల్ బెడ్రూం ఇళ్లు అనర్హులకు కేటాయించారని తహసీల్దార్ మహబూబ్ అలీకి స్థానికులు గురువారం వినతిపత్రం అందించారు. స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నా కానీ బుధవారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా అనర్హులకు పంపిణీ చేసి తాళాలు వేశారని స్థానికులు తెలిపారు.

పాఠశాలల్లో బతుకమ్మ సంబురాలు



గార్ల: ఆశ్రమ పాఠశాలలో..

జిల్లా వ్యాప్తంగా గురువారం పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ఇంటి వద్ద సేకరించిన పలురకాల పూలతో చేరుకున్న విద్యార్థినులు పోటీపడి బతుకమ్మలను పేర్చారు. ప్రతి ఒక్కరూ కోలాటమాడుతూ.. పాటలుపాడుతూ.. సందడి చేశారు. సంస్కృతి సంప్రదాయాలను గుర్తు చేసేలా పాఠశాలల్లో పండగ వాతావరణం నెలకొంది.

- సాక్షి నెట్‌వర్క్



చిన్నగూడూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



డోర్నకల్: సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో..



మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ బాలికల పాఠశాలలో..



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లి జెడ్పీ హైస్కూల్లో..



గూడూరు: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



కేసముద్రం: ఇనుగుర్తి జెడ్పీ హైస్కూల్‌లో..



పెద్దవంగర: జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



బయ్యారంలోని బాలికోన్నత పాఠశాలలో..



తొర్రూరు: పట్టణంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో..



కురవి: సిద్ధార్థ స్కూల్‌లో..



మరిపెడ రూరల్: గాలివారిగూడెం పాఠశాలలో..

జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉంటా..



దివ్యాంగుడితో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల కోసం భూములు కోల్పోయిన వారికి మరోచోట భూములను ఏర్పాటు చేయాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలువార్డులో గడపగడపకు ఇంటింటికి ప్రజా ఆశీర్వాదయాత్ర గురువారం హుస్సేన్‌నాయక్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడికల్ కళాశాల పేరుతో బాబునాయక్ తండాలోని నిరుపేదల భూములు లాక్కొని కనీసం నష్టపరిహారం చెల్లించలేదన్నారు. రానున్న ఎన్నికల్లో తనని ఎమ్మెల్యే గెలిపిస్తే బాబునాయక్ తండాలో మెడికల్ కాలేజీ కోసం భూములు కోల్పోయిన వారికి మరోచోట భూములు మంజూరు చేస్తానన్నారు. జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉంటారన్నారు. కార్యక్రమంలో మానుకోట అసెంబ్లీ కన్వీనర్ ఎర్రం రెడ్డి సిద్ధార్థ రెడ్డి, శక్తి కేంద్ర సభ్యులు రమేష్ నాయక్, పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లె సందీప్, రాంబాబు, బాలు నాయక్, యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుండా మోసం



మాట్లాడుతున్న విజయసారథి

నెహ్రూసెంటర్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన బీఆర్‌ఎస్ను ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని దాస్యం రామ్మూర్తి ప్రాంగణంలో సీపీఐ లీడర్ క్యాడర్, యువ కామ్రేడ్స్ వర్క్‌షాపు గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా విజయసారథి మాట్లాడుతూ.. ప్రజావ్యతిరేక పాలన సాగించిన కేసీఆర్ పాలన తుదిదశకు చేరిందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. తొమ్మిదిన్నరేండ్లలో బూటకపు హామీలు, మోసపూరిత వాగ్దానాలే తప్పా రాష్ట్ర ప్రజానికానికి చేసిందేమిలేదన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం గృహలక్ష్మి, దళితబంధు, బీసీల రుణాలు అంటూ మభ్యపెట్టేందుకు ప్రయత్నించారని కానీ ప్రజలు ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌కు పది సీట్లు కూడా దాటవని, బీజేపీకి తెలంగాణలో అధికారం కలగానే మిగులుతుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారధిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మీ, కట్లోజు పాండురంగాచారి, తండా సందీప్, శ్రావణ్, రవీందర్ పాల్గొన్నారు.

'అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారు'



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

డోర్నకల్: తమ గ్రామాల్లో ఎమ్మెల్యే సహకారంతో చేపడుతున్న అభివృద్ధి పనులకు కొంతమంది ఉద్దేశపూర్వకంగా అడ్డంకులు సృష్టిస్తున్నారని బీఆర్‌ఎస్ గ్రామ ప్రధాన కార్యదర్శి ఊడ్గుల వీరన్న తెలిపారు. మండలంలోని చిలుకొయ్యలపాడులో గురువారం స్థానిక నాయకులతో కలిసి వీరన్న విలేకరులతో మాట్లాడుతూ.. అభివృద్ధిపరంగా వెనుకబడి ఉన్న తమ గ్రామ పరిస్థితి ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు వివరించగా అభివృద్ధి పనుల కోసం రూ.60 లక్షలకు పైగా నిధులు కేటాయించారని తెలిపారు. సర్పంచ్ తోపాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి పనులు జరగకుండా అడుగడుగునా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శి ఆత్మహత్యాయత్నానికి తమ పార్టీ నాయకులకు ఎలాంటి సంబంధం లేదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు గజ్జి మల్లయ్య, మాజీ సర్పంచులు బండ్ల వెన్న, మాన్య, నాయకులు బోయిన రంజిత్ కుమార్, రాము, సందీప్, రమేష్, రవింద్రబాబు, మంగ్యా పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



కేసముద్రం: ప్రచారం చేస్తున్న అంబటి మహేందర్‌రెడ్డి

కేసముద్రం: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మహముద్‌పట్నం, భుక్యారాంతండాజీపీ, తావుర్యాతండాజీపీలలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి మహేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్యారంటీ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మిట్టగడుపుల యాకుబ్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు చిట్ల సంపత్, జాటోత్ నరేష్, రాము, దేవేందర్, సురేష్, నేతాజీ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలి

బయ్యారం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని మిర్యాలపెంట ఎంపీటీసీ సనప సోమేష్ గురువారం గ్రామంలో ప్రజలను కలిశాడు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకన్న, రమేష్, మోహన్ రావు, లాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చుకుంటేనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు భవానినగర్ తండా, గోపాలపురం కాలనీ, ఇద్గా బజారులలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారంటీ కరపత్రాలను గురువారం పంపిణీ చేశారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి వీరేందర్, అర్బన్ వైస్ ప్రెసిడెంట్ బండి ఉప్పలయ్య, కాంగ్రెస్ ఎస్టీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు బానోత్ ప్రసాద్ నాయక్, అర్బన్ కాంగ్రెస్ కార్యదర్శులు పిల్లి కృష్ణ, బానోత్ సురేష్, తదితరులు ఉన్నారు.

గ్యారంటీ పథకాలతో గెలుపు ఖాయం

గూడూరు: సోనియాగాంధీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలతో తెలంగాణలో కాంగ్రెస్ అధికారం ఖాయమైందని జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టి వెంకన్నయాద్ అన్నారు. మండలంలోని సీతానగరంలో గురువారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లికొండ మధుగౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అర్రెం వీరస్వామి, ఎడ్ల నరేష్‌రెడ్డి, గోపగాని మహేందర్‌గౌడ్, చీకటి శ్రీనివాస్‌గౌడ్, హెచ్చు శివ, ముత్యం లక్ష్మినారాయణ, సీతానగరం గ్రామ పార్టీ అధ్యక్షుడు మారం కిషన్‌రెడ్డి, రాజబాబు, వెంకట్రాం, వాగ్యనాయక్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కాంగ్రెస్‌లోకి ఉపేందర్



పెద్దవంగర: మండలంలోని చిన్నవంగర గ్రామానికి చెందిన తొర్రూరు పీఏసీఎస్ వైస్ చైర్మన్ భర్త ఉపేందర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరాడు.

ఆర్థికసాయం

డోర్నకల్: ఇటీవల మరణించిన మండలంలోని అమ్మపాలెం గ్రామానికి చెందిన కారు డ్రైవర్ గాదె నవీన్ కుటుంబానికి సహచర డ్రైవర్లు రూ.6వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో డ్రైవర్ల అసోసియేషన్ నాయకులు సాధనాల రాము, శివ, తదితరులు ఉన్నారు.

పరిసరాలు శుభ్రం

మరిపెడ రూరల్: మండలంలోని కోట్యతండా గ్రామ పంచాయతీ పరిధిలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఏక్ తారీఖ్.. ఏక్ ఘంటా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని అంతర్గత రోడ్లు, పరిసరాలను శుభ్రం చేశారు.

పరామర్శ

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని రేగడితండా గ్రామ రైతు కోఆర్డినేటర్ గుగులోత్ రాంచంద్రునాయక్ లక్ష్మీతండ్రి బాలక్యానాయక్ మృతిచెందగా ఎమ్మెల్యే బానోత్ శంకర్నాయక్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

సేవాలాల్ సేన మండల అధ్యక్షుడిగా విక్రమ్

బయ్యారం: సేవాలాల్‌సేన మండల అధ్యక్షుడిగా విక్రమ్‌నాయక్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్ననాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్థికసాయం

నర్సింహులపేట: మండలంలోని వస్త్రాంతండా శివారు గ్యాంగతండాకు చెందిన రమేష్, లక్ష్మీ దంపతుల కుమారుడు దీక్షిత్ తలసేమియా వ్యాధితో బాధపడుతుండగా పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో రూ.41వేలు గురువారం తల్లిదండ్రులకు అందజేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పూర్ణచందర్, సంజీవ, హెచ్‌ఎం రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి పాఠశాలలో పేద విద్యార్థులకు సుమారు 16మందికి శ్రీ సాయి ఫణిశ్వరీ డ్రెస్సెస్ షాప్ యాజమాన్యం ఓబిలిశెట్టి శ్రీనివాసరావు సౌజన్య దంపతులు గురువారం దుస్తులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం పూజారి వీరయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్, పీఈటీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చేపపిల్లల..

దంతాలపల్లి: మండలంలో ముదిరాజ్‌ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన చేప పిల్లలను గురువారం పంపిణీ చేసినట్లు మత్స్యశాఖ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోగల దాట్ల, పెద్దముప్పారం, దంతాలపల్లి, రామవరం, గున్నెపల్లి, నిదానపురం, బొడ్లాడ, ఆగపేట్ గ్రామాల మత్స్యకారులకు పంపిణీ చేశామన్నారు.

నిర్ణయించిన ధరలకే గ్యాస్ విక్రయాలు

నర్సింహులపేట: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే గ్యాస్ విక్రయాలు జరుగుతున్నాయని గ్యాస్ ఏజేన్సీ నిర్వాహకులు పుప్పాల నాగార్జున అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో అయన విలేకరులతో మాట్లాడారు. ఎక్కువ ధరలకు అమ్ముతున్నారని కొందరు రాజకీయ నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. ఎక్కువ ధరలకు అమ్మితే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

పెద్దవంగర: దాతల సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం బుదారపు శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్న పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు యూత్‌ఫర్ సేవా వరంగల్ స్వచ్ఛంద సంస్థ అందజేసిన ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్స్‌ను ఆయన పంపిణీ చేశారు.

పట్టణ బీఆర్‌ఎస్ మైనార్టీ కమిటీ ఎన్నిక

కేసముద్రం: మండల కేంద్రంలో పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్ ఆధ్వర్యంలో గురువారం పట్టణ బీఆర్‌ఎస్ మైనార్టీ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గప్పార్, ఉపాధ్యక్షుడు జలాల్ షరీఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మైయినొద్దిన్, ప్రధాన కార్యదర్శి మదార్‌సాహెబ్, కోశాధికారి అంకుశ్‌అలీ, ప్రచార కార్యదర్శి చాంద్‌పాషా, సహాయ కార్యదర్శి యాకుబ్‌పాషా, కార్యనిర్వాహక సభ్యులను ఎన్నికున్నట్లు తెలిపారు.

ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి

దంతాలపల్లి: మతోన్మాద నియంతృత్వ శక్తులకు ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని మానుకోట జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి నల్లుసుధాకర్‌రెడ్డి పిలుపు ఇచ్చారు. గురువారం మండలకేంద్రంలో నిర్వహించిన పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని పార్టీలకు ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, దర్శనం రామ్మూర్తి, కృష్ణ, సారయ్య, వెంకన్న పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

గార్ల/డోర్నకల్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గురువారం గ్రామాల్లో పార్టీల నాయకుల ఫ్లెక్సీలను ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారు. విగ్రహాలు, స్మారక స్థూపాలకు ముసుగులు వేస్తున్నారు.

క్రైం కార్నర్..

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు



గార్ల: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్‌షాపులపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించి రూ.9500 విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని మర్రిగూడెం, బుద్దారం గ్రామాలకు చెందిన బోడ మంగ్యా, ఇస్లావత్ రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్సై బానోత్ వెంకన్న తెలిపాడు.

బయ్యారంలో..

బయ్యారం: మండలకేంద్రంలోని పలు బెల్ట్‌షాపులపై గురువారం బయ్యారం పోలీసులు దాడులు నిర్వహించారు. రూ.10,400 విలువైన మద్యంను స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

గుడుంబా స్వాధీనం

నెల్లికుదురు: 20లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. మండలంలోని తారాసింగ్ బావి తండాకు చెందిన గుగులోతు రవి 20లీటర్ల గుడుంబాను విక్రయించడానికి తరలిస్తున్న క్రమంలో మండలంలోని నైనాల బస్‌స్టాండ్ వద్ద గురువారం పట్టుకొని గుడుంబాను స్వాధీనం చేసుకుని రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఇద్దరి బైండోవర్

నెల్లికుదురు: మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన బానోతు బుజ్జి, కాస్యతండాకు చెందిన బానోతు హట్యాలను గుడుంబా కేసులో ఇద్దరి గురువారం తహసీల్దార్ రాజు వద్ద బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నెల్లికుదురు: చికిత్సపొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గాదరి బక్కయ్య (46) గత నెల 23న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యంకోసం ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం బక్కయ్య మృతి చెందాడు.

అక్రమంగా ఇసుక రవాణా



చిన్నగూడూరు: మండలంలోని ఆకేరు వాగు సమీపంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. అక్రమ ఇసుక రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోతుందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని విస్సంపల్లి, ఉగ్గంపల్లి, చిన్నగూడూరు, జయ్యారం శివారు ఆకేరు వాగు నుంచి ఇసుక రవాణా సాగుతున్నప్పటికీ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'మానుకోట క్రీడలకు పుట్టినిల్లు'



మహబూబాబాద్ అర్బన్: క్రీడాకారులు క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్ ఎంపికలు నిర్వహించారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మానుకోట జిల్లా క్రీడలకు పుట్టినిలులాంటిదని ఈ జిల్లా నుంచి క్రీడల్లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారు. సూరా జిల్లాలోని జరగనున్న రాష్ట్రస్థాయికి బాలబాలికలు సుమారు 30మంది ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాస నాగమణి, పీఈటీలు జ్యోతి, వెన్నెల, విజయ్, నిర్మల, ప్రభాకర్ పాల్గొన్నారు.